విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

ప్రణాళికాబద్ధంగా ఓట్ల లెక్కింపు
కలెక్టర్ సుమిత్ కుమార్

విశాలాంధ్ర-భీమవరం: ఓట్ల లెక్కింపునకు పక్కా ప్రణాళికతో ఏర్పాట్లను చేపట్టినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ తెలిపారు. గురువారం ఏపీ సచివాలయం కాన్ఫరెన్స్ హాల్ నుండి రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సాధారణ ఎన్నికలు - 2024లో భాగంగా కౌంటింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భీమవరం కలెక్టరేట్‌లోని విసి హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్, జిల్లా రెవిన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు పాల్గొన్నారు. రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలు, ఆ కేంద్రంలో నిబంధనల మేరకు టేబుల్స్ ఏర్పాటు, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు టేబుల్స్ ఏర్పాటుపై ఆయన పలు సూచనలు చేశారు. ముఖ్యంగా స్ట్రాంగ్ రూముల భద్రత, సిసి కెమెరాలు నిఘా ఉండాలన్నారు. జిల్లాలో రెండు కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ ఏర్పాట్లను రానున్న నాలుగు రోజుల్లో పూర్తి చేయడానికి చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ చందన దుర్గాప్రసాద్, డిప్యూటీ తహసిల్దార్ మద్రాపు సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతా చర్యలు పరిశీలన

విశాలాంధ్ర - భీమవరం: భీమవరం విష్ణు కాలేజీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కల్పించిన భద్రతా చర్యలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం పరిశీలించారు. రోజువారీ తనిఖీలో భాగంగా స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లా రెవెన్యూ అధికారితో కలిసి తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూమ్‌కు వేసిన తాళాలను, సీళ్లను పరిశీలించారు. అక్కడ పరిస్థితులను గమనించారు. భద్రతా సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుకు అనువైన హాల్స్‌ను పరిశీలించారు. లెక్కింపుకు అనువుగా వున్న టేబుల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు, డిపిఆర్ఓ టి.నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

రాజకీయ పార్టీలు శాంతియుతంగా వ్యవహరించాలి
ఎస్పీ మేరీ ప్రశాంతి

విశాలాంధ్ర-ఏలూరు: జూన్ 4వ తేదీన ఎన్నికల లెక్కింపు సందర్భంగా రాజకీయ పార్టీలు శాంతియుతంగా వ్యవహరించాలని జిల్లా ఎస్.పి. డి.మేరీ ప్రశాంతి కోరారు. జూన్ 4న నిర్వహించే కౌంటింగ్ సందర్భంగా స్థానిక గిరిజన్ భవనంలో గురువారం రాజకీయ పార్టీ ప్రతినిధులు, కార్యకర్తలతో ముందస్తుగా ప్రజా శాంతికి భంగం కలగకుండా ఉండేలాగా సమావేశం, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్.పి. మాట్లాడుతూ జూన్ 6 వరకు ఏలూరు జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని, జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ లు అమల్లో ఉన్నందున ప్రజలు నలుగురికి మించి ఒకచోట గుంపుగా ఉండరాదన్నారు. కౌంటింగ్ రోజు అనవసరంగా రోడ్ల మీదకు వచ్చి గొడవలకు కారకులై క్రిమినల్ కేసుల్లో ఇరుక్కోవద్దని , రెచ్చగొట్టే చర్యలు, ఇతరులను కించపరిచే వ్యాఖ్యలు చేయరాదని అన్ని రాజకీయ పార్టీల వారు శాంతియుతంగా ఉండాలని సూచించారు. ముందస్తుగా అనుమతులు లేకుండా ఊరేగింపులు, ర్యాలీలు చేయరాదన్నారు. జూన్ 6 వరకు నమోదయ్యే క్రిమినల్ కేసులన్నింటిని ప్రత్యేకంగా పరిగణించి ఎన్నికల కమిషన్ పర్యవేక్షణలో కేసులు అన్నింటిలో శిక్ష పడే విధంగా ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్.పి. జి. స్వరూపారాణి, ఎస్.బి సి.ఐ. మల్లేశ్వరరావు, ఏలూరు డిఎస్.పి. ఇ. శ్రీనివాసులు, 2,3, పట్టణ సిఐలు ప్రభాకర్, శ్రీనివాసులు, కైకలూరు రూరల్ ఎస్.ఐ.రామకృష్ణ, పోలీస్ సిబ్బంది, రాజకీయ పార్టీల నాయకులు, వారి ప్రధాన అనుచరులు పాల్గొన్నారు.

దెందులూరు నియోజకవర్గ స్ట్రాంగ్ రూమ్‌ల తనిఖీ

విశాలాంధ్ర-ఏలూరు: దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంల వద్ద భద్రతను జాయింట్ కలెక్టర్, దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి.లావణ్య వేణి గురువారం తనిఖీచేశారు. ఏలూరు లోని సర్. సి.ఆర్. ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూంను ఆమె పరిశీలించారు. ఈవీఎంల భద్రత అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ పరిసర ప్రాంతంలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందన్నారు. ఈవీఎంలకు తలుపులకు వేసిన తాళాలను, తాళాలకున్న సీళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అన్ని చోట్లా సీసీ కెమెరాలు పరిశీలన చేశారు.

నేటి నుండి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

విశాలాంధ్ర- భీమవరం టౌన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ,జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ పాఠశాలలలో పదవ తరగతి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు ఈనెల 24వ తేదీ నుండి వచ్చేనెల మూడో తేదీ వరకు జరుగుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్. వెంకట రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు 8953 మంది విద్యార్థులు రాయనున్నారని, దీనికి 41 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. దీనికి సంబంధించి సలహాలు, సూచనలు ఏమైనా ఉంటే జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌లో సంప్రదించాలన్నారు.

ఆరు కేంద్రాల్లో డీవైఈవో పోటీ పరీక్షలు

విశాలాంధ్ర -భీమవరం : ఎపిపిఎస్సీ శనివారం నిర్వహించే డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పోటీ పరీక్షకు 840 మంది హాజరుకానున్నారని, వీరికి జిల్లాలోని ఆరు కేంద్రాలు కేటాయించినట్లు డిఆర్ఓ జె.ఉదయభాస్కర్ మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరంలోని డిఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో 130, విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో 100, డిఎన్నార్ అటానమస్ కళాశాలలో 100, నర్సాపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో 100, తాడేపల్లిగూడెం వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో 100, శశి ఇంజనీరింగ్ కళాశాలలో 250 మంది చొప్పున పరీక్ష వ్రాయనున్నట్లు ఆయన వివరించారు. పరీక్ష ఉదయం 9 గంటలనుంచి 11.30 వరకు నిర్వహించనున్నట్లు, పరీక్షార్థులు ఉదయం 8.30 గంటలోపు ఆయా కేంద్రాలకు చేరుకోవాలని నిమిషం ఆలస్యం అయినా అనుమతించబోమని ఆయన పేర్కొన్నారు.

విద్యాహక్కు చట్టానికి తూట్లు

- నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల విక్రయం
- తల్లిదండ్రులకు తప్పని ఆర్థిక భారం
- చర్యలు చేపట్టని అధికారులు

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: అందరికీ ఉచితంగా అందవలసిన విద్య ఏనాడో అంగడి సరుకు అయ్యింది. ప్రైవేట్ దశ నుంచి కార్పొరేట్ గా రూపాంతరం చెందిన తర్వాత పేద, దిగువ, ఎగువ, మధ్యతరగతి విద్యార్థులకు విద్య ఖరీదైన అంశంగా మారిపోయింది. ప్రభుత్వాలు రూపొందించిన విద్యాహక్కు చట్టం సైతం అభాసుపాలవుతున్నా... నవ్విపోదురు గాక మాకేంటన్న చందంగా విద్యాశాఖ అధికారులు వ్యవహరిస్తుండడం సిగ్గుచేటని విద్యావేత్తలు, మేధావులు ఏవగించుకుంటున్నారు. పలు విద్యార్థి సంఘాలు ఫలానా పాఠశాల యాజమాన్యం పుస్తకాలు విక్రయిస్తుందని ఆధారాలతో సహా చూపించినా సంబంధిత అధికారులు చేష్టలుడిగి చూస్తుండడం సిగ్గుచేటు. జిల్లాలో కార్పొరేట్ విద్యాసంస్థలు పుస్తకాలను మార్కెట్ ధరలకు మించి విక్రయిస్తున్నారు. ఒక్కో తరగతికి రూ.5 వేల నుంచి రూ. 20 వేల వరకు పైబడి పుస్తకాల కోసం వ్యయం చేయాల్సి వస్తోంది. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే కొనుగోలు చేయాలని విద్యాసంస్థల యాజమాన్యాలు హుకుం జారీ చేస్తున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విడతలవారీగా కొనుగోలు చేసే వెసులుబాటు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నా కనికరించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. విద్యాహక్కు చట్టానికి నిలువునా తూట్లు పొడుస్తున్న ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలపై విద్యాశాఖ అధికారులు స్పందించని పక్షంలో జిల్లా కలెక్టర్ అయినా స్పందించాలని కోరుతున్నారు.

ఎన్నికల కోడ్ పేరిట పట్టించుకోని అధికారులు

ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే కార్పొరేట్ విద్యా మాఫియా విద్యార్థుల తల్లిదండ్రులపై పుస్తకాల పేరిట ఆర్థిక భారం మోపుతున్నా విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఆయా విద్యాసంస్థలు తమ సంస్థల పేరిట పుస్తకాలను ముద్రిస్తూ యథేచ్ఛగా విక్రయిస్తుట్లు ఆధారాలు ఉన్నా డీఈవో, డిప్యూటీ డిఈవోలు కనీసం స్పందించడం లేదు. ఎన్నికల కోడ్ చెబుతూ కార్పొరేట్ విద్యాసంస్థల వ్యాపారాలకు పరోక్షంగా సహకరిస్తున్నారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. చిత్తశుద్ధి ఉంటే విద్యా హక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

అధిక ధరలతో విక్రయం... విద్యాహక్కు చట్టానికి విరుద్ధం

కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలలో పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు అధిక ధరలకు విక్రయించడం విద్యా హక్కు చట్టానికి పూర్తి విరుద్ధం. చట్టానికి వ్యతిరేకంగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు పుస్తకాలు విక్రయిస్తున్నా విద్యాశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని ఏఐఎస్ఎఫ్ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి విమర్శించారు. విద్యాశాఖ అధికారులు కేవలం పత్రికా ప్రకటనలకు పరిమితం కాకుండా పుస్తకాలు విక్రయిస్తున్న విద్యాసంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

టి.అప్పలస్వామి

25న డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర-ఏలూరు: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పరీక్షలు ఈ నెల25న ఏలూరు జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా సమన్వయ అధికారి డి.పుష్పామణి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడూతూ ఏలూరు జిల్లాలో ఈనెల25న నిర్వహిస్తున్న ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పరీక్షలకు 320 అభ్యర్థులు హాజరు అవుతారని తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణకు, ఏలూరులో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని ఇందులో సిద్ధార్థ క్వెస్ట్ సి.బి.ఎస్.ఇ స్కూల్, ఏలూరు ఇంజనీరింగ్ టెక్నాలజీ కాలేజీలోనూ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష లు ఉదయం గం.9 నుండి ప్రారంభం అవుతుందని, పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం గం.7.30 నుండి 8.15 వరకు, గ్రేస్ పీరియడ్ కలుపుకుని 8.30 వరకు మాత్రమే పరీక్షా కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందని తెలిపారు. పరీక్ష నిర్వహణ ప్రక్రియలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవల్ని విస్తృతం చేస్తాం

విశాలాంధ్ర-నర్సాపురం : బ్యాంకింగ్ రంగంలో ఖాతాదారులకు విశిష్ట సేవలు అందించడంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా ముందు వరుసలో ఉందని, రానున్న రోజుల్లో సేవలను మరింత విస్తృతం చేస్తామని జోనల్ మేనేజర్ కె.శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని కొండాలమ్మ గుడి ఆర్చ్ వద్ద కు మార్చబడిన బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యలయంను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో ఆయన మాట్లాడుతూ నర్సాపురం పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలకు 43ఏళ్ళ నుంచి బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలు అందిస్తుందని తెలిపారు. ఖాతాదారుల నమ్మకాన్ని మరింతగా పెంపొందించుకునే విధంగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలను అధిగ మిస్తూ రైతులకు, డ్వాక్రా సంఘాల కు, స్వయం ఉపాధి రుణాలు అందించడంలో బ్యాంక్ ఆఫ్ ఇండియాదేపై చేయిగా నిలిచిందని వివరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ ఎస్ జీ వి గాంధీ నాయుడు, ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు వి. రవిశంకర్, యూనియన్ నాయకులు టి.సూర్య నారాయణ, బ్యాంక్ స్పెషల్ అసిస్టెంట్ రహీమ్, సిబ్బంది ప్రశాంత్, షారా, హిమదేవి, చిట్టిబాబు, ప్రవీణ్, జ్యోతి, స్వరూప్ రిటైర్డు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజ్ కమల్‌కు న్యాయం జరిగే వరకు పోరాటం

విశాలాంధ్ర-తణుకు: అంబులెన్స్ ఓనర్ రాజ్ కమల్‌ను వేధిస్తూ చెప్పుతో కొట్టిన యూనియన్ ప్రెసిడెంట్ అతని కుమారుడు పై చర్యలు తీసుకోవాలని,తణుకు అంబులెన్స్‌లు అన్నింటికీ ఒకే సీరియల్ విధానం పాటించాలని,మూడు నెలలుగా ఆర్థికంగా నష్టపోయిన రాజ్ కమల్ కుటుంబానికి న్యాయం చేయాలని లేని పక్షంలో రాజ్ కమల్ కుటుంబంతో ఆమరణ నిరాహారదీక్ష చేస్తామని జై భీమ్ దళిత ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షులు చోళ్ళ రాజు హెచ్చరించారు. గురువారం స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని అంభేద్కర్ భవనంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర షెడ్యూల కులాల సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి కొండే నాగేశ్వరరావు ,పశ్చిమగోదావర్గోదావరి జిల్లా ఎస్.సి, ఎస్.టీ. విజిలన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు చవ్వాకుల భరత్ కుమార్, బాధితుడు కప్పల రాజ్ కమల్ , భార్య కప్పల పావని, తండ్రి కప్పల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపును ప్రశాంతంగా నిర్వహించి విజయవంతం చేయాలి
- జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించడానికి ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ లోని వీడియోకాన్ఫరెన్స్ హాలులో జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి, పివో ఐటిడిఏ యం. సూర్యతేజ, డిఆర్ఓ డి. పుష్పామణి తో కలిసి జిల్లాలో 7 నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులతో జూన్ 4వ తేదీన ఏలూరు సి.ఆర్. రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రశాంతంగా, సజావుగా నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందునుంచే పరిశీలించుకోవాలని తగు జాగ్రత్తలు పాటించి కౌంటింగ్ సరళిలో సమయాన్ని వృధాకాకుండా చూసుకోవాలన్నారు. ప్రతి లెక్కింపు కేంద్రంలో వెబ్ కాస్టింగ్, రౌండ్ల వారీగా టేబుల్స్, కౌంటింగ్ సూపర్ వైజర్లు, అసిస్టెంట్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ ప్రక్రియకు ఉపయోగించే వస్తువులు, తదితర అంశాలను రిటర్నింగ్ అధికారులు ప్రత్యేకమైన శ్రద్ధతీసుకొని పర్యవేక్షించుకోవాలని కలెక్టర్ సూచించారు. కౌంటింగ్ కు అవసరమైన వస్తువుల చెక్ లిస్టును తయారుచేసి రిటర్నింగ్ అధికారులకు అందజేయాలని డిఆర్వోను కలెక్టర్ ఆదేశించారు. కౌంటింగ్ రౌండు వారీగా సమాచారాన్ని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు అందించడానికి అవసరమైన ఇంటర్నెట్ సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాలని వివరించారు. కౌంటింగ్ కు కేటాయించిన అధికారులు, సిబ్బందికి పూర్తిస్థాయిలో అవగాహన కలిగే విధంగా శిక్షణ అందించాలని తెలిపారు. సమావేశంలో ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యం. ముక్కంటి, ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎస్ ఎస్ కె ఖాజావలి, చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె. అద్దయ్య, నూజివీడు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వై. భవానీ శంకరి, కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె. భాస్కర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బాబ్జి, కలెక్టరేట్ ఎవో కె. కాశీవిశ్వేశ్వరరావు, కలెక్టరేట్ లోని ఎన్నికల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య శాఖ డ్రైవర్లకు మూలవేతనం ప్రకారం జీతం చెల్లించాలి
ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అప్పలరాజు

విశాలాంధ్ర-ఏలూరు: నగరపాలక సంస్థ ప్రజారోగ్య శాఖలో పనిచేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లకు మూలవేతనం ప్రకారం జీతాలు చెల్లించాలని ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటి యుసి) ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజారోగ్య శాఖలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్న సిబ్బందికి మూల వేతనం ప్రకారం జీతాలు చెల్లించాలని కోరుతూ గురువారం జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ నగర పాలక సంస్థకు చెందిన పి హెచ్ నాన్ పిహెచ్ వర్కర్స్ కు సంబంధించి 9 మందికి 2022 ఏప్రిల్ నెలకు ముందే పీ హెచ్ ట్రాక్టర్ డ్రైవర్స్ గా పదోన్నతి ఇచ్చారని తెలిపారు. పదోన్నతి కల్పించి 2 సంవత్సరములు పూర్తి కావస్తున్నా డ్రైవర్ కు మూల వేతనం ప్రకారం జీతం ఇవ్వకుండా వర్కర్ జీతం ఇస్తున్నారని ఆరోపించారు. వీరికి వార్షిక ఇంక్రిమెంట్లు, అడాక్ ఇంక్రిమెట్లు గత 2సంవత్సరములుగా ఇవ్వడం లేదన్నారు. నెలకు ఒక్కింటికి రూ.5వేలు చొప్పున గత 2 సంవత్సరములుగా ఒక్కొక్కరు రూ.1 లక్షా 20 వేలు జీతం నష్టపోయా రన్నారు. డ్రైవర్ల పదోన్నతి విషయమై నగరపాలక అధికారులు కమిషనర్, అదనపు కమిషనర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సంబంధిత డిప్యూటీ కార్యనిర్వాహక ఇంజనీర్, తదితర అధికారులు తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. అధికారులు తక్షణం జోక్యం చేసుకుని తమ సమస్యలను పరిష్కరించాలని అప్పలరాజు కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డి. అప్పారావు, ట్రాక్టర్ డ్రైవర్లు ఉన్నారు.

మెట్ట ప్రాంతాల్లో నీటి నిల్వగుంతల నిర్మాణాలు

ఉపాధి నిధులతో రైతులకు చేయూత

విశాలాంధ్ర-లింగపాలెం: మెట్ట ప్రాంతాలలో నీటి నిల్వ గుంతలు తవ్వుకునేందుకు రైతులను ఉపాధి పథకం ద్వారా ప్రోత్సహిస్తున్నారు. ఇటువంటి నిల్వ గుంతల వల్ల ప్రయోజనం ఎక్కువగా ఉంటుందని డ్వామా అధికారులు వివరిస్తున్నారు. మెట్ట ప్రాంతంలో కాస్త ఎండలు అధికంగా వేస్తే నీటి జలాలు అడుగంటుకు పోతున్నాయి. సాగునీరు దేవుడెరుగు... తాగునీరు దొరికితే చాలు అనే పరిస్థితి మెట్ట ప్రాంతంలో నెలకొంది. ఉపాధి పథకంలో చెరువుల పూడికతీతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతోపాటు నీటి నిల్వ గుంతలవల్ల ప్రయోజనం ఎక్కువగా ఉంటుందని అధికారులు భావించి వీటికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నీటి నిల్వ గుంతలను తవ్వేందుకు ఎప్పుడో కార్యాచరణ రూపొందించినా దీనిపై రైతుల నుంచి ఆసక్తి కరువైంది. దీంతో వీటి నిర్మాణపు పనులు మందకొడిగా సాగుతూ వస్తున్నాయి. తమకున్న భూమిలో ఈ గుంత నిర్మించడం వల్ల రెండు నుంచి మూడు సెంట్లు భూమివృధా అవుతుందని దీనివల్ల ఫల సాయం తగ్గుతుందని రైతులు అపోహ పడుతూ ముందుకు రావడం లేదు. ఈరెండు, మూడు సెంట్లుభూమిలో నీటి నిల్వ గుంతలు తవ్వటం వల్ల కలిగే ప్రయోజనం అధికంగా ఉంటుందని డ్వామా అధికారులు భావించి వీటిని తవ్వేందుకు చర్యలు చేపట్టారు. ఒక ఎకరం భూమిలో నీటి నిల్వ గుంతలు తవ్వటం వల్ల నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని పేర్కొంటున్నారు. ఒక గుంతలో 450 క్యూబిక్ మీటర్ల నీటి నిల్వలు ఉంటాయని ఒక ఏడాదికి గుంతల వల్ల కలిగే నీటి సామర్థ్యం రైతులు వేసే పంటలకు ప్రయోజనం కలిగిస్తుందని పేర్కొంటున్నారు. వీటిపై రైతులు అవగాహన పెంచుకోవాలని కోరుతున్నారు. మెట్ట ప్రాంతమైన లింగపాలెం మండలంలో 2024-2025 ఆర్థిక సంవత్సరంలో 200 నీటినిల్వ గుంతలు తవ్వేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. వీటిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. వీటి నిర్మాణానికి అయ్యే ఖర్చు అంతటిని ఉపాధి పథకం భరిస్తుంది. రైతులపై ఆర్థిక భారం పడదు. ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి విడతగా 30 నీటి నిల్వగుంతల నిర్మాణాలను చేపట్టారు. వీటిలో13 గుంతల నిర్మాణపు పనులు జరుగుతున్నాయి. భోగోలులోని రైతులు ముందుకు రావడంతో ఈ గ్రామంలో ఐదు గుంతల నిర్మాణం చేపట్టారు. సింగుగుడెంలో5, కే. గోకవరం, లింగపాలెంలో 3చొప్పున ఆశన్నగూడెం, అయ్యపరాజుగూడెం, కొత్తపల్లి, రంగాపురంలలో రెండేసి చొప్పున అన్నపనేనివారి గూడెం, ధర్మాజీగూడెం, ముడిచెర్ల, ములగలంపాడు, పుప్పాలవారిగూడెం, టిసిహెచ్ఆర్ పాలెంలలో ఒకటి చొప్పున వీటిని మంజూరు చేశారు. ఒక్కొక్క నీటి నిల్వ సామర్థ్యం గుంతను 10మీటర్ల పొడవు10మీటర్ల వెడల్పు 2 మీటర్ల లోతులో వీటి నిర్మాణం జరుగుతుంది.ఒక గుంత నిర్మాణానికి ఉపాధి పథకంద్వారా రూ.58,718లను ఖర్చుపెడుతున్నట్లు అధికారులు వివరించారు. వీటి నిర్మాణాలు జరిగితే భవిష్యత్తులో వీటి వల్ల కలిగే ప్రయోజనం అధికంగా ఉంటుందని అంటున్నారు.

కౌంటింగ్‌కు పూర్తి భద్రత
జిల్లా ఎన్నికల అధికారి వె.ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు : ఏపీ సచివాలయం కాన్ఫరెన్స్ హాల్ నుండి గురువారం సాధారణ ఎన్నికలు - 2024లో భాగంగా కౌంటింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులు, తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్ష నిర్వహించారు. ఏలూరు కలెక్టరేట్ లోని విసి హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వె.ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి, పివో ఐటిడిఎ యం. సూర్యతేజ, డిఆర్ఓ డి.పుష్పామణి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు - 2024లో భాగంగా కౌంటింగ్ కోసం అన్ని విధాలా సన్నద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం కౌంటింగ్ కోసం అన్ని ఏర్పాట్లను పక్కాగా చేపడుతున్నామన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్‌ను ఏలూరు సమీపంలోని వట్లూరులోని సి ఆర్ ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలోని పలు విభాగాల్లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశామన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్, కౌంటింగ్ కోసం అడిషనల్ ఏఆర్‌ఓలు, కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లను నియమించినట్టు తెలిపారు. మొదటి ర్యాండమైజేషన్, శిక్షణా కార్యక్రమం ఈనెల 27వ తేదీన నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యం. ముక్కంటి, ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎన్ఎస్‌కె ఖాజావలి, చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె. అద్దయ్య, నూజివీడు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వై. భవానీ శంకరి, కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె. భాస్కర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బాబ్జి, కలెక్టరేట్ ఏవో కె. కాశీవిశ్వేశ్వర రావు, కలెక్టరేట్‌లోని ఎన్నికల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూంల వద్ద భద్రత పరిశీలన

విశాలాంధ్ర- నూజివీడు టౌన్: నూజివీడు నియోజకవర్గ ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంల వద్ద భద్రతను నూజివీడు ఆర్డీఓ, నూజివీడు నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి వై. భవానీశంకరి గురువారం పరిశీలించారు. ఏలూరు లోని సర్.సి.ఆర్. ఇంజ నీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూంను అధికారులతో కలిసి ఆర్డీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా భవానీశంకరి మాట్లాడుతూ ఈవీఎంల భద్రత అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈవీఎం లకు ప్రభుత్వం మూడు అంచెల భద్రత కల్పించిందన్నారు. తలుపులకు వేసిన తాళాలను, తాళాలకున్న సీళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అన్ని చోట్లా సీసీ కెమెరాలు పరిశీలన చేశారు. తనిఖీ అనంతరం సందర్శకుల రిజిష్టర్ లో ఆమె సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కల్వరగిరి ఉత్సవాలు

విశాలాంధ్ర-లింగపాలెం: భోగోలు గట్టుపై కల్వరగిరి మహోత్సవాలను నిర్వహిస్తున్నారు. దాదాపు 24 సంవత్సరాలుగా ఈఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుండటంతో ఆర్.సి.ఎం క్రైస్తవ మత సంస్థ ఆధ్వర్యంలో వీటిని నిర్వహిస్తున్నారు. ఉత్సవాలు మొదలుపెట్టాక ఈ ప్రాంతానికి పుణ్యక్షేత్రంగా గుర్తింపు వచ్చింది. దీంతో ప్రతి ఏటా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రజలంతా శాంతి సమాధానాలతో ఉండటం కోసం ఒకరి పట్ల మరొకరు ప్రేమ అనురాగాలతో ఉండాలని ఈ ఉత్సవాలలో బోధనలు చేస్తున్నట్లు ఫాదర్ ఆనందబాబు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా అన్నదాన కార్య క్రమాలు నిర్వహిస్తున్నారు. పెద్ద సంఖ్యలో విశ్వాసులు ఉత్సవాలకు హాజరవు తున్నారు. మూడు రోజులు పాటు నిర్వహించే ఉత్సవాలు శుక్రవారంతో ముగుస్తాయి. ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలలోఫాదర్ జాన్ సందీప్, ఇటలీలో ఫాదర్‌గా పనిచేస్తున్న మహేష్ కుమార్ బోధనలు చేశారు.

విజయం వైసీపీదే

విశాలాంధ్ర- పాలకొల్లు: విజయం వైసీపీనే వరిస్తుందని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ ధీమా వ్యక్తం చేశారు. గురువారం పాలకొల్లు వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలకొల్లులో వైసీపీ గెలుపుపై తమకు ఎలాంటి సందేహం లేదన్నారు. నియోజకవర్గంలో వైకాపా బలంగా ఉందన్నారు. ఓటర్లకు టిడిపి తరఫున రూ.1500 పంచినంత మాత్రాన ప్రజలు గుడ్డిగా టిడిపికి ఓట్లు వేయరని ఆయన వ్యాఖ్యానించారు. ఈ విలేకరుల సమావేశంలో పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధించే వారిపై కేసు

విశాలాంధ్ర - టి.నరసాపురం: అదనపు కట్నం కోసం వేధించే భర్త, అత్త మామలపై కేసు నమోదు చేసినట్లుగా ఎఎస్ఐ జయకుమార్ తెలిపారు.

ఆయన తెలిపిన వివరాల ప్రకారం వెలగపాడు పంచాయతీలోని వీరభద్రంవరం గ్రామానికి చెందిన కాటబోయిన రాజేశ్వరికి సురేష్ తో మూడు సంవత్సరాల క్రితం వివాహమైంది.

వివాహ సమయంలో ఇచ్చిన కట్నం చాలలేదంటూ ఇటీవల భర్త, అత్త మామలు అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని రాజేశ్వరి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

CHANGE OF NAME

I, **BODDUPALLI JOY ADAMS (NEW NAME)**,minor represented by monion Guardian father **BODDUPALLI VENKATA RAMESH**, Previously called **BODDIPALLI JOY ADAMS (OLD NAME)**, Resident of D.No.3-80, Harijanapeta, Thokalapudi Village, Veeravasaram Mandal, West Godavari District-534 247, A.P.Now Changed name from **BODDIPALLI JOY ADAMS (OLD NAME)** to **BODDUPALLI JOY ADAMS (NEW NAME)** Today onwards Use New Names for all further Transactions.

CHANGE OF NAME

I, **CHINTAPALLI RAMYASRI (NEW NAME), D/o MADHAV RAO**, Previously called **CHINTAPALLI RAMYASRI MADHAV RAO (OLD NAME)**, Resident of Door No.2-68/1, SB Palem, Karugorumilli Village, Achanta Mandal, West Godavari District- 534 269, A.P. Now Changed my name from **CHINTAPALLI RAMYASRI MADHAV RAO (OLD NAME)** to **CHINTAPALLI RAMYASRI (NEW NAME)** Today onwards Use my New Name for all further Transactions.

బుద్ధుని బోధనలు ఆచరణీయం

విశాలాంధ్ర- తాళ్లపూడి: వైశాఖ బుద్ధ పూర్ణిమ వేడుకను తహసిల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బుద్ధుడు మళ్ళీ పుడితే దేశం ఇంకా బాగుంటుందని, మళ్ళీ పుట్టినా మనమంతా ఆయనను మార్చేస్తవేమో అని అన్నారు. ఏ.యస్.ఓ జోడాల మాట్లాడుతూ ప్రపంచంలోనే మొట్టమొదటి సామజిక విప్లవకారుడు, ప్రజ్ఞ కరుణశీలతో మనిషికి మనస్సే ప్రధానం అని చెప్పి మధ్యే మార్గాన్ని సూచించిన మహనుభావుని బుద్ధ జయంతి చేయడం అవసరం అని అందరికీ వైశాఖ బుద్ధపూర్ణిమ శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సీతారామ రాజు, వి.ఆర్.ఓ సంజీవ రావు,వి.ఆర్.ఏ లు శ్రీలక్ష్మి, రమణమ్మ, భాగ్యలక్ష్మి, వ్యవసాయ సహాయకుడు సుధీర్ పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సు కోసం మహా చండీయాగం

విశాలాంధ్ర - సీతానగరం/ రాజానగరం: ప్రజా శ్రేయస్సు కోసమే మహా చండీయాగం చేయడం జరిగింది అని రాజానగరం నియోజక వర్గ కూటమి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ అన్నారు. గురువారం కోరికొండ మండలం గాదరాడ గ్రామంలో నిర్మించిన ఓం శివశక్తి పీఠం దేవాలయాల సమూహంలో తమిళ నాడుకు చెందిన 30 మంది వేద పండితులతో అట్టహసంగా ప్రారంబించారు. దీనిలో బత్తుల బలరామకృష్ణ, బత్తుల వెంకటలక్ష్మి మరియు వారి కుటుంబ సభ్యులు భక్తిశ్రద్ధలతో హెూమలను నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సు కోసమే ఈ హెూమాల ను నిర్వహిస్తామని అన్నారు. దీనిలో లక్ష్మీ గణపతి నవగ్రహ శత్రు సంహార రుద్ర సహిత మహా చండీయాగం, అష్టలక్ష్మి మహా మృత్యుంజయ బైరవ సహిత రాజ శ్యామల యాగం, మన్యసుక్త ఆంజనేయ, ధన్వంతరి ఆరోగ్య పాశుపతి సహిత మహా సుదర్శన యాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన, టీడీపీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

బాలదుర్గమ్మ ఆలయంలో తులాభార కార్యక్రమం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి బాలదుర్గమ్మ ఆలయంలో గురువారం తులభార కార్యక్రమం అంగ రంగ వైభవంగా జరిగింది. దేవరపల్లికి చెందిన మామిడిపల్లి సంపత్ శ్రావణి దంపతుల కుమార్తె అక్షయ శ్రీ కడియాలమ్మకు పటిక బెల్లంతో తులాభారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పైడి కొండల సత్యనారాయణ కోశాధికారి కామిశెట్టి దుర్గారావు కమిటీ సభ్యులు కామిశెట్టిమంగా కామి శెట్టి ధర్మయ్య మాతు సీత డాక్టర్ మామిడిపల్లి వెంకటరావు రఘు జస్వంత్ నాగమణి శ్రావణి శశి ఆలయ కమిటీ సభ్యులు మహిళా భక్తులు పది సంఖ్యలు పాల్గొన్నారు

కమ్యూనికేషన్స్ స్కిల్స్ పై బోధన

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లా కేంద్ర గ్రంథాలయం-కాకినాడలో 23వ తేదీన నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరము కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థిని, విద్యార్థులచే ఉదయం 8 గంటల నుండి 9గం.ల వంకూ ఉపాధ్యాయులు సత్యబాల విద్యార్థులకు కమ్యూనికేషన్స్ స్కిల్స్ బోధించారు. విద్యార్థులచే పుస్తక పఠనం, విశ్రాంత ఉపాధ్యాయురాలు టిఎస్ లక్ష్మీ కుమారి విద్యార్థులకు నీతి కథలు ,దేశభక్తి గేయాలు నేర్పించారు. ఉపాధ్యాయులు శ్రీనివాసరావు విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయాధికారి ఇన్‌ఛార్జ్ కిషోర్, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది సలాది రాజు. టి వీర్రాజు, అరుణ పాల్గొన్నారు.

పేపర్ క్రాఫ్ట్, డాన్స్‌లలో శిక్షణ

విశాలాంధ్ర - కాకినాడ : తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని కుళాయి చెరువు పార్క్‌లోని గాంధీనగర్ శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా 8వ రోజు గురువారం పాఠశాల విద్యార్థులకు కథలు చెప్పడం, పేపర్ క్రాఫ్ట్, డ్యాన్సులలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో రీసోర్స్ పర్సన్ పి వీరబాబు పేపర్ క్రాఫ్ట్, డ్రాయింగ్ శిక్షణ ఇచ్చారు.

బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కొర్లమండకు అభినందనలు

విశాలాంధ్ర - సామర్లకోట : ప్రముఖ న్యాయవాది కొర్లమండ వీర భద్రరావు 150 సంవత్సరాల చరిత్ర కలిగిన కాకినాడ బార్ అసోసియేషన్ లోసాధించిన హ్యాట్రిక్ విజయం సామర్లకోట పట్టణానికే గర్వకారణం అని పలువురు వక్తలు అన్నారు. సామర్లకోట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కాకినాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా మూడోసారి ఘన విజయం సాధించిన సామర్లకోటకు చెందిన ప్రముఖ న్యాయవాది, పూర్వపు పాత్రికేయులు అయిన కొర్లమండ వీరభద్ర రావు శ్రీవాణి దంపతులకు ఆత్మీయ అభినందన కార్యక్రమం లయన్స్ అధ్యక్షులు కానుబోయిన విజయ కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా ప్రెసిడెంట్ చిత్తులూరి వీర్రాజు (రాజా), సినీ దర్శకులు, రచయిత నటులు కెబి ఆనంద్ తదితరులు మాట్లాడుతూ ప్రజా సేవలో ఎల్లవేళలా ముందుండి అవసరాల్లో ఉన్న వారికి చేదోడుగా ఉంటున్న న్యాయవాది కొర్లమండ దంపతులకు సేవలను అభినందించారు. వరుసగా మూడుసార్లు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా గెలుపొంది హ్యాట్రిక్ సాధించడం సామర్లకోట పట్టణానికి ఎంతో గర్వకారణం అన్నారు. రానున్న రోజుల్లో అసోసియేషన్ అధ్యక్ష పదవిని అధిరోహించాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు వీరభద్ర రావు శ్రీవాణి దంపతులను పూలమాలలు, దుస్సాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ కార్యదర్శి బడుగు సీతా రామరాజు, నాయకులు మేకా శ్రీనివాస్, సేపేని సురేష్, కర్రి ఆదినారాయణ రెడ్డి, గుండు శంకర రావు, ప్రత్తి రామ లక్ష్మణమూర్తి, అందుగుల జార్జి చక్రవర్తి, కాపుగంటి పైడిరత్నం, కటకం గంగబాబు, సకలకళా సమాఖ్య నాయకులు కేతినీడి శ్రీనివాస్, కర్రి బాబురావు, సీపీఐ సీనియర్ నాయకులు ఎలిశెట్టి రామదాస్, సామర్లకోట - పెద్దాపురం ఆర్కెస్ట్రా ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు గిడుతూరి శ్రీనివాస్, కొండల రావు, తదితరులు పాల్గొని కొర్లమండ దంపతులకు సేవలను కొనియాడారు. సన్మానగ్రహీత భద్రరావు మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశీస్సులు, జీవిత భాగస్వామి, కుటుంబం సహకారంతో తాను ఇప్పటి వరకూ ఎన్నో విజయాలు, సేవా కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు. రానున్న రోజుల్లో ఇటు బార్ అసోసియేషన్‌కు, అటు సామర్లకోటలోని ప్రజలకు తనవంతు సేవలను అన్నివేళలా అందుబాటులో ఉండి అందించనున్నట్టు చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

డీజిల్ ట్యాంకర్ పట్టివేత

విశాలాంధ్ర - కాకినాడ : యానాం(పుదిచ్చేరి యూటీ) నుంచి అక్రమంగా డీజిల్ రవాణా జరుగు తుందన్న విశ్వసనీయ సమాచారంపై విజిలెన్స్ అధి కారులు, రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులతో కలిసి తాళ్లరేవు మండలంలోని పోలేకుర్రు గ్రామ సమీపంలో అశోక్ లేలాండ్ ఆయిల్ ట్యాంకర్ నెంబర్ ఏపి 05టిబి3645 వాహనంలో 4000 లీటర్ల డీజిల్‌ను గుర్తించారు. సదరు డీజిల్‌ను డ్రైవర్ గోవల సుబ్బారావు ఏ సుదీర్ తండ్రి వెంకన్నబాబు యానాం (పుదిచ్చేరి యుటి)లోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ నుండి టాటాఏసిఇ వాహనం నెంబర్ ఏపి 37 వై 6456 ద్వారా లీటరుకు రూ.84/- కొనుగోలు చేసి, మోటార్ , పైపు సహాయంతో అశోక్ లేలాండ్ ఆయిల్ ట్యాంకర్ వాహనం నెంబర్ ఏపి 05టిబి3645కు లోడు చేయబడుతుంది. తదుపరి అశోక్ లేలాండ్ ట్యాంకర్ కమ్ టాటా ఏస్ వాహనం యజమాని అడ్డాల వీర వెంకట సత్యనారాయణ తండ్రి సుబ్బారావు వారి ఆదేశాల మేరకు సదరు డీజిల్‌ను తాళ్లరేవుకు రవాణా చేసి అక్కడ గల చేపలు మరియు రొయ్యల చెరువుల మోటార్ ఇంజిన్లకు లీటరుకు రూ.88/-లకు అమ్మకము చేయుచున్నారు. సదరు డీజిల్ అక్రమ రవాణా చేయుట కారణముగా సుమారు రూ 8,39,000/-లు విలువ గల 4000 లీటర్ల డీజిల్‌ను, అశోక్ లేలాండ్ ఆయిల్ ట్యాంకర్ వాహనమును సివిల్ సప్లయ్స్ అధికారులు, తాళ్ళరేవు వారు సీజ్ చేసి సంబంధిత వ్యక్తులపై యు/ఎస్ 188,286 ఐపిసి ఎస్ఇసి 7(1) ఆఫ్ ఇసి యాక్ట్ 1955.మరియు ఎపి పెట్రోల్ ఉత్పత్తి (ఎల్ & ఆర్ఎస్)ఆర్డర్ 1980 ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు కొరకు పోలీసు స్టేషన్ కు సిఫారసు చేయటమైనది. ఈ సందర్భముగా రీజనల్ విజిలెన్స్ ఎస్పి కెఐస్ఎస్వి సుబ్బారెడ్డి, ఐపిఎస్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ & ఎన్ఫోర్స్మెంట్ పరిధిలోని మూడు జిల్లాలలో పెట్రోల్ ఉత్పత్తుల అక్రమ నిల్వలు, అక్రమ రవాణా పై నిరంతరం నిఘా కొనసాగుతుంది అని, ఎవ్వరైనా ఆక్రమముగా పెట్రోల్ ఉత్పత్తుల కొనడం, అమ్మడం చేస్తే సదరు వ్యక్తుల పై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అని తెలిపియున్నారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ అధికారులు జగన్నాధరెడ్డి, లక్ష్మీనారాయణ, డిఎస్ఓ ప్రసాద్, సిఎస్‌డిటి లక్ష్మీప్రసన్న, ఏఎస్ఓ రామణలక్ష్మి దేవి మరియు లోవరాజు, శివ పాల్గొన్నారు.

అహింసకు, శాంతికి రూపం బుద్ధుడు : పులి

విశాలాంధ్ర - జగ్గంపేట : విశ్వమానవాళికి సహనాన్ని, ప్రేమతత్వాన్ని, అహింసను, శాంతిని పంచే బుద్ధుని బోధనలు ఆచరణీయమని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ కార్యదర్శి పులి ప్రసాద్ అన్నారు. విశ్వ జ్ఞానం సంపన్నుడు సిద్ధార్థ గౌతమ బుద్ధుని జయంతి వేడుకలను ఆయన జిల్లా మహిళా అధ్యక్షురాలు ఉల్లం నందిని, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇంచార్జి సాధే నరేంద్రబాబుతో కలిసి స్థానిక వాసుదేవ నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పులి ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల మధ్య ప్రేమ, దయ, కరుణ, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం. మానవత్వం లేని రాజ్యం తనకు వద్దని రాజ్యాన్ని, రాజ్యం ఇచ్చే భోగ భాగ్యాలను వదిలేసిన వ్యక్తి బుద్ధుడు అన్నారు. 2600 వేల సంవత్సరాల క్రిందటే 29 సంత్సరాల నవ యవ్వనములో రాజ్యాన్ని తృణపాయంగా త్యజించి, సమ సమాజము కోసం పరితపించిన మానవతా మూర్తి బుద్ధుడు అని కొనియాడారు. ఆ మహనీయుని బాటలో అందరూ నడవాలని అన్నారు.

రఘురామకృష్ణంరాజుకి ఘన స్వాగతం

విశాలాంధ్ర - కొత్తపేట : కోనసీమ పర్యటనలో భాగంగా నర్సాపురం పార్ల మెంట్ సభ్యులు రఘు రామ కృష్ణం రాజుకి కొత్తపేట సెంటర్‌లో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానం దం, మండల టీడీపీ అధ్యక్షుడు కంఠం శెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ యువ మోర్చా అధికార ప్రతినిధి పాలూరి జయ ప్రకాష్ నారాయణ, కొత్తపేట నియోజకవర్గ కో కన్వీనర్ దామోదర్, పెరుమల్ల అన్న వరం, అద్దంకి చంటి బాబు యువ మోర్చా మండల అధ్యక్షుడు కిరణ్, ముత్యాల చినస్వామి, శ్రీఘ్రకొలపు గోపాలకృష్ణ, సాయిప్రసాద్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని యాచకుడి మృతి

విశాలాంధ్ర - రావులపాలెం : మండలంలోని రావులపాడు గ్రామం అలంకార ఫర్నిచర్ షాప్ ఎదురుగా గల రహదారిపై గాయాలతో ఉన్న గుర్తు తెలియని యాచకుడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ నందు పంపగా చికిత్స పొందుతూ 21 రాత్రి 12 గంటలకు చనిపోయినట్లు హాస్పటల్ నుండి రాబడిన డెత్ ఇంటిమేషన్ పై రావులపాలెం ఏఎస్ఐ జి సూరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వివరాలు తెలియాల్సి ఉన్నది.

నూకాంబిక అమ్మవారి హుండీ లెక్కింపు

విశాలాంధ్ర - ఆలమూరు : మండలంలోని చింతలూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ నూకంబిక అమ్మవారి జాతర మహెూత్సవంలో భాగంగా దేవస్థానంలో ఏర్పాటు చేసిన 9 హుండీలను గురువారం లెక్కించారు. 35 రోజులకు రూ.21,29,106 వచ్చినట్లు ఈవో ఎమ్ఎస్ఆర్ కృష్ణ తెలిపారు. ఈ లెక్కింపు దేవాదాయ ధర్మాదాయ శాఖ రామచంద్రపురం డివిజన్ తనిఖీ అధికారి బాలాజీ రాంప్రసాద్ సమక్షంలోనూ, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ అధికారుల పర్యవేక్షణ, గ్రామస్తుల సహకారంతో నిర్వహించినట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ భాస్కర్ శ్రీనివాస్, ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వికసించిన మే పుష్పం

విశాలాంధ్ర -తాళ్లపూడి: తాళ్ళపూడిలోని ఓ ఇంటి పెరట్లో మే నెల పుష్పం వికశించింది. సంవత్సరం లో ఒకసారి మాత్రమే పూయటం దిని ప్రత్యేకత. మండల కేంద్రమైన తాళ్ళపూడిలో పూల మొక్కల పెంపక హౌత్స హికులు గోకవరపు కుటుంబం అనేక పూల మొక్కలతో పాటు మే పుష్పాల మొక్క పెంచుతున్నారు. మే నెల వచ్చిన తరువాత ఇటీవల ఆ పుష్పం వికశించింది. ఈ మే నెల పుష్పం గురించి చుట్టు పక్కల వారు దీన్ని గురించి విశేషంగా చర్చించుకుంటూ, చూడటానికి వస్తున్నారు.

నిండు ప్రాణాన్ని కాపాడిన హైవే సిబ్బంది

విశాలాంధ్ర - రావులపాలెం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా గోదావరి బ్రిడ్జిలపై నుండి ఆత్మహత్యకు పాల్పడుతున్న సంఘటనలు ఇటీవల కాలంలో పెరిగాయి. రావులపాలెం, సిద్ధాంతం బ్రిడ్జిలపై ఇలాంటి సంఘటనలు జరగకుండా హైవే అధికారులు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశారు. దీంట్లో భాగంగా హైవే పెట్రోలింగ్ సిబ్బంది సిద్ధాంతం నుండి రావులపాలెం వైపు గస్తీ నిర్వహిస్తుండగా సిద్ధాంతం బ్రిడ్జిపై సుమారు 45 ఏళ్ల మహిళ గోదావరిలోకి దూకేందుకు ప్రయత్నిస్తుండగా అది గమనించిన హైవే పెట్రోలింగ్ సిబ్బంది వి రాజ బాబు, డి దుర్గారావు, జి విజయ చందర్ రాకెట్ వేగంతో చేరుకొని ఆ మహిళను అతి కష్టం మీద ఆపగలిగారు. ఆ మహిళను వెంటబెట్టుకొని రావుల పాలెం పోలీస్ స్టేషన్ తరలించి పోలీసులకు బ్రిడ్జిపై జరిగిన సంఘట నను హైవే సిబ్బంది వివరించారు. అయితే ఈ మహిళ పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణానికి చెందిన వారిగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే బ్రిడ్జి పై నుండి గోదావరిలోకి దూకేందుకు ప్రయత్నిస్తున్న ఈ మహిళను చాకచక్యంగా ఆపగలిగిన హైవే సిబ్బందిని ఆ మార్గం ద్వారా వెళుతున్న పలువురు ప్రయాణికులు అభినందించారు.

డెయిరీ ఫామ్ లోన్‌లలోకి ప్రవేశించిన గోద్రెజ్ క్యాపిటల్

విశాలాంధ్ర-రాజమండ్రి: గోద్రెజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ యొక్క ఆర్థిక సేవల విభాగం అయిన గోద్రెజ్ క్యాపిటల్, డైరీ ఫామ్ రుణాలను ప్రారంభించడంతో వ్యవసాయ రంగంలోకి ప్రవేశిస్తున్నట్లు ప్రకటించింది. క్రీమ్‌లైన్ డైరీ ప్రొడక్ట్స్ లిమిటెడ్ ద్వార ఈ-డెయిరీతో వ్యూహాత్మక భాగస్వామ్యం ద్వారా,ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మరియు ఇతర ప్రాంతాలలోని చిన్న డైరీ ఫామ్ యజమానులకు ఆర్థిక సహాయం గోద్రెజ్ క్యాపిటల్ అందించనుంది. గోద్రెజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ యొక్క డైవర్సిఫైడ్ ఫుడ్ అండ్ అగ్రి-బిజినెస్ సమ్మేళనం అయిన గోద్రెజ్ అగ్రోవెట్ లిమిటెడ్ (జి ఏ వి ఎల్)కి అనుబంధ సంస్థ క్రీమ్ లైన్ డైరీ ప్రొడక్ట్స్ లిమిటెడ్. ఇది గోద్రెజ్ జెర్సీ బ్రాండ్ పేరిట తమ ఉత్పత్తులను విక్రయిస్తుంది. భారతదేశంలో పాల ఉత్పత్తుల వినియోగం క్రమంగా పెరుగుతూనే ఉంది, ఇది పాడి రైతులకు అవకాశాలు మరియు సవాళ్లు రెండింటినీ అందిస్తుంది. ఈ రంగంలో ఉత్పాదకతను మెరుగుపరచడానికి మరియు ఆర్థిక లబ్ధిని పెంచడానికి అనువైన ఫైనాన్సింగ్‌తో ఈ రైతులకు సాధికారత కల్పించే ఆవశ్యకతను గోద్రెజ్ క్యాపిటల్ గుర్తించింది. ఈ కార్యక్రమం కోసం, రైతులకు అవకాశాలను సులభతరం చేయడానికి తమ భాగస్వామిగా ద్వార ఈ-డెయిరీతో కలిసి గోద్రెజ్ క్యాపిటల్ పనిచేస్తుంది. డెయిరీ ఫామ్ రుణాలతో, జీఏవిఎల్ అలవాటయిందా కొద్దిగా వద్ద ఎంప్యానెల్ చేయబడిన రైతులకు పశువుల కొనుగోలు, నిర్వహణ కోసం తనఖా రహిత రుణాన్ని గోద్రెజ్ క్యాపిటల్ అందిస్తుంది. పూర్తి డిజిటలైజ్ చేయబడిన ప్రక్రియ , వేగవంతమైన మంజూరు, రుణ వితరణ, రెండు సంవత్సరాల వరకు సౌకర్య వంతమైన చెల్లింపు అవకాశాలు, ఇతర ప్రయోజనాలతో పాటు రుణాలను సౌకర్యవంతంగా పొందేలా డెయిరీ ఫామ్ యజమానులకు ఈ లోన్ ఆఫ రింగ్ అవకాశాన్ని అందిస్తుందని గోద్రెజ్ క్యాపిటల్ ఎండి, సీఈఓ మనీష్ షా చెప్పారు.

ప్రముఖ ఆధ్యాత్మిక గురువులు హరిరామ్‌నాద్ మృతి

విశాలాంధ్ర - ఆత్రేయపురం : ప్రముఖ ఆధ్యాత్మిక గురువులు, ప్రముఖ రచయిత, చిన్ననాటి నుండి బృందా వనంలో ప్రత్యేకంగా తపస్సు ఆచరించి రాధాకృష్ణ తత్వాన్ని ప్రజలలో పంచాలని చక్కటి సంకల్పంతో దేశవ్యాప్తంగా తీర్థ యాత్రలు చేస్తూ సుమారు 40 సంవత్సరాల క్రితం హరిరామ్ నాథ్ ర్యాలీ గ్రామం విచ్చేశారు. శ్రీ జగన్మోహిని కేశవ స్వామి వారికి ఆధ్యాత్మిక సేవ చేయాలనే సంకల్పంతో ర్యాలి గ్రామంలోనే ఉండిపోయి, అప్పటినుండి ప్రతిరోజు సాయంత్రం ఆయన ప్రవచనాలతో భక్తులను సన్మార్గంలో నడిచేలా చేస్తూ, సుమారు 200 పైచిలుకు ఆధ్యాత్మిక రచనలు రచించారు. ప్రపంచవ్యాప్తంగా ఆయన భక్తులను ఏర్పరుచుకుని నిరంతరము ఆధ్యాత్మిక సేవ చేస్తూ గురువారం తనువు చాలించారు.

పారదర్శకంగా ఓట్ల లెక్కింపు : కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపులో అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్ లో గురువారం ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సజావుగా, ప్రశాంతంగా, పారదర్శకంగా, పటిష్టంగా ఓట్లలెక్కింపు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఆదిశగా అభ్యర్థులు, రాజకీయ పక్షాలు సహకరించాలన్నారు. అభ్యర్థులు వారి కౌంటింగ్ ఏజెంట్లగా పంపే వారి పూర్తి వివరాలను ఫారం-18 లో ఈనెలాఖరు నాటికి సమర్పించాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ అనంతరం కూడా 15 రోజుల పాటు శాంతి భద్రతల సమస్య రాకుండా ముందస్తు పూర్తి భద్రతా చర్యలు అమల్లో ఉంటాయన్నారు. రౌండువారీ ఫలితాలను డిస్ ప్లే చేయడం జరుగుతుందన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపుకు 14 టేబుల్స్ ఏర్పాటు చేయడం జరుగు తుందన్నారు. ఈవిఎంల్లో ఓట్ల లెక్కింపు పూర్తయిన పిదప ప్రతి అసెంబ్లీ నియోజక వర్గానికి సంబంధించి ఐదేసి చొప్పున వివిప్యాట్ లో ఓట్లను లెక్కించడం జరుగుతుందన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాకు సంబంధించి ఇద్దరు, ముగ్గురు చొప్పున కౌంటింగ్ ప్రక్రియను నిర్దేశిత ప్రాంతం నుంచి చిత్రీకరించాలే తప్పా ఈవిఎంలను జూమ్ చేసి తీసేందుకు వీలులేదని స్పష్టం చేశారు. వివిఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్ లను సంబంధిత అభ్యర్థులు, వారి ఏజెంట్లు ప్రతిరోజు మూడుసార్లు నిర్దేశించిన సమయంలో సందర్శించి పరిశీలించుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి డి. పుష్పామణి, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు టి.ఆర్.ఆర్. మోహన్ రావు(వైఎస్ఆర్ సిపి), యంఎల్ ఎస్ఎ కుమార్ (కాంగ్రెస్), కె. బాలకృష్ణ(తెలుగుదేశం), బి. రాజు(నవరంగ కాంగ్రెస్ పార్టీ), డి.ఆదర్శ్(లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ), కలెక్టరేట్ ఏవో కె. కాశీవిశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొండబాబు విజయం కోరుతూ అన్నవరం సైకిల్ యాత్ర

విశాలాంధ్ర - కాకినాడ : వనమాడి కొండబాబు అఖండ మెజారిటీతో విజయం సాధిం చడం ఖాయమని కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు గురువారం కాకినాడ నుండి అన్నవరం వరకు సైకిల్ యాత్ర నిర్వ హించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో కాకినాడ సిటీ ఎమ్మెల్యేగా వనమాడి కొండబాబు విజయం సాధించాలని కోరుతూ కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్‌కు చెందిన పలువురు సభ్యులు కాకినాడ నుండి అన్నవరం వరకు సైకిల్ యాత్ర నిర్వహించారు. స్థానిక సంజయ్ నగర్ సెంటర్ నుండి ప్రారంభించిన ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నాయకులు తుమ్మల రమేష్, ఒమ్మి బాలాజీ ముఖ్య అతిధులుగా పాల్గొని జెండా ఊపి సైకిల్ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రంలో కాకినాడ నగరంలో గత 5 సంవత్సరాలుగా రవాణా రంగానికి సంబంధించి అనేక ఇబ్బం దులు ఎదుర్కొన్నామని, వీటన్నిటినీ మనసునిండా నింపుకుని ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలంతా తెలుగుదేశం-జనసేన-బిజేపి కూటమి అభ్యర్థులకు పెద్దఎత్తున ఓట్లు వేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా కాకినాడ సిటీలో అభివృద్ధికి మారుపేరు అయిన వనమాడి కొండబాబును గెలిపించుకోవడానికి తామంతా సాయశక్తుల కృషి చేయడం జరిగిందని తెలిపారు. కొండబాబు నామినేషన్ వేసినపుడే ఆయనను గెలిపించమని తాము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి వారికి మొక్కుకోవడం జరిగిందని, లెక్కింపులు ఇంకా అవ్వకముందే కొండబాబు విజయానికి చిహ్నంగా తామంతా కలిసి మొక్కు తీర్చుకునేందుకు అన్న వరం సైకిల్ యాత్రగా వెళ్ళడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదరెడ్ల నానాజీ, వెలుగుల శ్రీనివాస్, ముదునూరు సతీష్, అల్లంరాజు, ఏలిపే శ్రీనివాస్, అరగండ్ల గంగబాబు, దుర్గాప్రసాద్, పినుపోతల రవి, ప్రవీణ్ కిషోర్, పోలవరం శివ, ఎలమంచిలి సత్తిబాబు, పార్టీ నాయకులు బాసి రమణ, పలివెల బాబ్జి, నిద్రబింగి సత్తిబాబు, షేక్ జిలాని, ఎస్కే భాష, రిస్ అన్నవరం, మురళీకృష్ణ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర - అమలాపురం : కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామంలోని శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిం చనున్న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సంబంధించి కోనసీమ జిల్లాలో 7 అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా ఏర్పాటు చేసిన టేబుళ్ళ వివరాలుబీ రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి అసెంబ్లీ నియోజకవర్గానికి 10 టేబుళ్లు పార్లమెంట్ నియోజకవర్గానికి 10 టేబుళ్ళు ఏర్పాటు చేశారు. పి గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి అసెంబ్లీకి 12 టేబుళ్ళు, పార్లమెంట్కు 12 టేబుళ్ళు ఏర్పాటు చేశారు. రాజోలు అసెంబ్లీ నియోజక వర్గానికి సంబంధించి అసెంబ్లీకి 14 టేబుళ్ళు ,పార్లమెంట్కు 14 టేబుళ్ళలను ఏర్పాటు చేశారు. ముమ్మి డివరం అసెంబ్లీ నియోజక వర్గానికి సంబంధించి అసెంబ్లీకి 14 టేబుల్స్ పార్లమెంట్‌కు14 టేబుళ్ళలను ఏర్పాటు చేశారు. కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి అసెంబ్లీ 14 టేబుళ పార్లమెంటుకు 10 టేబుళ్ళు ఏర్పాటు చేశారు. అమలా పురం అసెంబ్లీ నియోజకవర్గం సంబంధించి అసెంబ్లీ 14 టేబుళ్ళు, పార్లమెంటుకు 12 టేబుల్స్ ఏర్పాటు చేశారు. మండపేట అసెంబ్లీ నియోజక వర్గానికి సంబంధించి అసెంబ్లీకి 10 టేబుల్స్, పార్లమెంటుకు 10 టేబుల్స్ ఏర్పాటు చేశారు.

ఒరిగామి, గణితం, ఇంగ్లీష్ పై మెళకువలు

విశాలాంధ్ర - కరప : జనవిజ్ఞాన వేదిక, కరప మండల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి వినోదం గురువారం స్థానిక శివాలయం వీధిలోని భవన నిర్మాణ కార్మికుల భవనంలో సిఐటి ఆధ్వర్యంలో జనవిజ్ఞాన వేదిక కాకినాడ జిల్లా కార్యదర్శి వి శ్రీరామారావు విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడో రోజులో భాగంగా ఓరుగామి గమ్ము లేకుండా పేపర్‌తో వస్తువులు తయారు చేయటం, గణితములో మెలకువలు, ఇంగ్లీషులో కొన్ని అంశాలను విద్యార్థులకు నేర్పడం జరిగిందన్నారు. అవగాహన ప్రధానంసంగా నేర్పడం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలోని 60 మంది విద్యార్థులు పాల్గొనడం జరిగిందని. ఈ శిబిరానికి వచ్చే విద్యార్థులు ఇంకా రావచ్చని ఈ అవకాశాన్ని సద్వినియం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వై శ్రీనివాసరావు, ఆర్ లక్ష్మి విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీరు, మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర - ఏలూరు : వేసవిలో త్రాగునీరు, మజ్జిగ అందించడం పుణ్యకార్యమని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పర్యవేక్షక ఇంజి నీరు సాల్మన్ రాజు చెప్పారు. స్థానిక రామ చంద్ర రావు పేటలోని శ్రీవేం కటేశ్వరస్వామి గుడివద్ద తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఉద్యో గులచే ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రంలో గురువారం ప్రజలకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాల్మన్ రాజు మాట్లాడుతూ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఉద్యోగులు సామాజిక బాధ్యతగా ప్రతీ సంవత్సరం ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటుచేసి, ప్రజలకు సేవలందిస్తున్నారని అభినందించారు. ఈ కార్యక్ర మంలో విద్యుత్ శాఖ ఈఈ జె.పి, నటరాజన్, అదనపు ఈఈ డి .ప్రసన్న వల్లి, ఏ.జి. సత్యనారాయణ, బలుసుబాబు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులచే పుస్తక పఠనం

విశాలాంధ్ర - కలిదిండి: స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొంటున్నారని గ్రంథాలయ శాఖ అధికారి జే. రమేష్ తెలిపారు. గురువారం కలిదిండి గ్రంథాలయంలో విద్యా ర్థులచే పుస్తక పఠనము, పుస్తక సమీక్ష మరియు వివిధ రకాల ఆటలను ఆడించి నట్లు తెలిపారు. విద్యావంతులు సాహితీ వేత్తలు ఉపాధ్యాయులు ప్రతిరోజు నిర్వహించే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేస్తున్నారని అన్నారు.

సత్యేంద్రబాబు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు సత్యేంద్ర బాబు జన్మదిన వేడుకలు స్థానిక వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారధి ట్రస్టు సభ్యులు గౌతు సత్యేంద్ర బాబును సన్మానించి ఆయనతో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సత్యేంద్రబాబు పుట్టినరోజు సంద ర్భంగా ఒక విద్యార్థికి రూ. 10వేలు, కుటుంబ పోషణ ఇబ్బందిగాఉన్న ఓ మహిళ కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. ఇందిరానగర్ కాలనీకి చెందిన బందారు వీరలక్ష్మి ఆరోగ్య పరిస్థితి బాగోనందున ఆమె కుటుంబం ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని నిత్యవసరకులు అందజేశారు. ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకున్న సత్యేంద్ర బాబును వారధి ట్రస్ట్ నిర్వాహకులు, నాలుగో వార్డ్ కౌన్సిలర్ వలవల తాతాజీ ,ట్రస్ట్ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సీతారాంబాబు, సాధనాల కరుణ, మద్దిపాటి శ్రీను, రామసూరి రెడ్డి, బొడ్డు వాసు ,దొండ పాటి పండు,తివార్ ,కంబాల పండు, రాంబాబు, బసవరాజు వేణు, సభ్యులు పాల్గొన్నారు.

చండీహోమం

విశాలాంధ్ర- పాలకొల్లు: పంచారామక్షేత్రం శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో పౌర్ణమి సందర్భంగా గురువారం చండి హెూమం ఘనంగా నిర్వహించారు. ఈ చండి హెూమంలో మొత్తం 26 మంది దంపతులు భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. వీరికి స్వామి వారి శేష వస్త్రములు, ప్రసాదములు అందజేశారు. ఈ కార్యక్రమములో ఆలయ కార్య నిర్వహణ అధికారి యాళ్ళ సూర్యనారాయణ, చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో సహాయ మాత ఉత్సవాలు

విశాలాంధ్ర - ముదినేపల్లి : మండల కేంద్రమైన ముదినేపల్లి ఆర్సిఎం చర్చి ప్రాంగణంలో సహాయమాత మహెూత్సవాలు స్థానిక చర్చి 55 సంవత్సరాలు నిండిన సందర్భంగా మూడు రోజులపాటు నిర్వహిస్తు న్నారు. ఈ సందర్భంగా దైవ సందేశాలు అందిస్తుండగా పలు ప్రాంతాల నుండి వచ్చిన విశ్వాసులు ఆలపిస్తున్న సంకీర్తనలు , సంగీతం ఆకర్షణీయంగా నిలుస్తు న్నాయి. గురువులు మాతంగి మరియ కుమార్ , రెంటాల విజయ్ ఆధ్వర్యంలో డివైన్ మేర్సీ, ధ్యానాశ్రమంకు చెందిన ఫాదర్ తోమస్, అమల్, ఫోర్ జీన్, చందు, బాలు దివ్య సత్ప్రసాధ ఆరాధన , స్వస్థతప్రార్ధనలు నిర్వహించారు. ముదినేపల్లి విచారణ పరిధిలోని పలు గ్రామాల నుండి విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శుక్రవారం జరుగు ముగింపు వేడుకల్లో వేలాదిగా పాల్గొని సహాయమాత ఆశీస్సులు పొందాలని కోరారు.

అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ

విశాలాంధ్ర-తణుకు : ద్వారకా తిరుమలలో బ్రహ్మోత్సవాల్లో స్వామి వారి కల్యాణం జరుగు సమయంలో ప గో జిల్లా పద్మ శాలి సంఘం తరపున రాష్ట్ర పద్మశాలి మహిళా అధ్యక్షు రాలు వావిలాల సరళాదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా అధ్య క్షుడు వానపల్లి నాగరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పద్మశాలిల ఆడబిడ్డ అయిన అమ్మ వారికి స్వామి వారికి మేళతా ళాలతో కోలాటం వంటి సాంప్రదాయ పద్ధతిలో పసుపు కుంకుమలు పట్టు వస్త్రాలు, తీపి కావిడలు మొదలగు వస్తువు లను సరళా దేవి, నాగ రాజు పద్మశాలి సంఘ సభ్యులంతా సమ ర్పించారు. ఈ కార్యక్రమంలో వానపల్లి రమేష్ దంపతులు, తాడిచెర్ల శ్రీనివాస్ దంపతులు జిల్లా మహిళా అధ్యక్షురాలు కె. విజయలక్ష్మి పాల్గొన్నారు.

శ్రీనివాసరావు దంపతులకు సన్మానం

విశాలాంధ్ర - కొయ్యల గూడెం : బ్రహ్మశ్రీ దాస రోజు శ్రీనివాసరావు దంప తులకు విశ్వబ్రాహ్మణ సం క్షేమ సంఘం గురువారం సన్మాన కార్యక్రమం నిర్వ హించింది. విశ్వకర్మ లెజెండరీ జాతీయ పురస్కారానికి ఎంపికైన శ్రీని వాసరావుని గవరవరంలోని శ్రీ కంచి కామాక్షి పీఠంలో ఘనంగా సత్క రించారు. హైదరాబాదుకు చెందిన విశ్వకర్మ నాలెడ్జి సెంటర్ 8వ వార్షికోత్సవ సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 26వ తేదీ శ్రీనివాస రావు అవార్డు అందుకోనున్నారు. దీనిని పురస్కరించుకుని విశ్వకర్మ అసోసియేషన్ అధ్యక్షులు దార్ల రాంబాబు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. జ్యోతిష శాస్త్రంలో శ్రీనివాస్ డాక్టరేట్ అందుకుని ఏజెన్సీ మెట్ట ప్రాంతానికి పేరు తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి జవాది శ్రీనివాస్, పెద్దోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.